క్లుప్తంగా

ఘనంగా మాస కల్యాణం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో ఆదివారం స్వామి మాస కల్యాణం కనులపండువగా జరిగింది. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి వారి మాస కల్యాణం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి మాస కల్యాణంలో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ఉచిత వైద్య సేవలు

మామిడికుదురు: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మల్టీ స్పెషాలిటీ మెగా మెడికల్ క్యాంపు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం జరిగింది. సేవా సంస్థ ప్రతినిధి కడలి గోపాలకృష్ణ ప్రశాంతి పతాకావిష్కరణ చేశారు. సేవా సంస్థల అధ్యక్షుడు అడబాల కొండబాబు ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. 15 విభాగాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. రక్త పరీక్షలు, ఈసీజీ, ఎక్స్‌రే తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. మొత్తం 611 మందికి వైద్య పరీక్షలు చేశారు. 12 మందిని కంటి శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేసి తీసుకు వెళ్లారు. శిబిరానికి వచ్చిన వారికి అన్నదానం చేశారు. ఈ శిబిరంలో స్థానిక సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



కబడ్డీ టీమ్‌ను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మండలంలోని గూడపల్లి పల్లిపాలెంలో జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆదివారం ఆయన సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని రెండో రోజు పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్న స్థానిక గ్రామ కంతలేశ్వరి అమ్మవారి యూత్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కేఎస్ఎన్ రాజు, సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి, ఎంపీటీసీ కొల్లు నరసింహారావు, సంఘ అధ్యక్షులు గోసంగి శ్రీను, చింతా రాజబాబు, ముప్పర్తి త్రిమూర్తులు, కొల్లాబత్తుల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టడీ మెటీరియల్ పంపిణీ

అంబాజీపేట: పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యా భారతి ఉచిత స్టడీమెటీరియల్‌ను సోమ, మంగళవారాల్లో పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ క్రిస్టోఫర్ కర్నోలియస్ తెలిపారు. సోమవారం పుల్లేటికుర్రు, ముక్కామల, కె.పెదపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, 24న తొండవరం, అంబాజీపేట, ఇసుకపూడి, చిరతపూడి జెడ్పీ హైస్కూళ్లలో జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పంపిణీ చేయనున్నారన్నారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గోగన్నమఠంలో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సూర్యారావు మాట్లాడుతూ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. నిత్యావసరాలతో పాటు ప్రతి వస్తువు ధర ఆకాశాన్నంటాయన్నారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, పార్టీ నేతలు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, ఈలి శ్రీనివాస్, సాగి పాపయ్యరాజు, భూపతిరాజు ఆంజనేయరాజు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

మలికిపురం: మండలంలోని గూడపల్లి పల్లిపాలెంలో ఆదివారం కబడ్డీ పోటీల్లోని విజేతలకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. వీటిని నిర్వాహకులు గోసంగి రమేష్, గోసంగి శ్రీను అందజేశారు. మొదటి బహుమతి శంకరగుప్తం రూ.12 వేలు, రెండో బహుమతి నాగుల్లంకకు రూ.8 వేలు, మూడో బహుతి రాజోలుకు రూ.5 వేల నగదు అందజేశారు.

బీసీ కార్పొరేషన్ల పదవీ కాలం పొడిగింపుపై హర్షం

రావులపాలెం: రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ల పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించడంపై మండలంలోని వెదిరేశ్వరానికి చెందిన రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానికంగా ఆమె మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా అత్యధికశాతం అవకాశం కల్పించింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వమేనన్నారు. ఈ నిర్ణయంతో బీసీ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కార్పొరేషన్ల పదవీకాలాన్ని పొడిగించడంపై సీఎం జగన్, స్థానిక ఎమ్మెల్యే, జగ్గిరెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

చురుగ్గా నూతన కాజ్ వే పనులు

- గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం
- తాజాగా రూ.2 కోట్లతో పనులు మొదలు



టేకిశెట్టిపాలెం వద్ద పాత కాజ్‌వేను ఆనుకుని నిర్మిస్తున్న కొత్త కాజ్ వేకు చేస్తున్న పనులు

సఖినేటిపల్లి: టేకిశెట్టిపాలెం పరిధిలో గోదావరి పాయ (బాడిరేవు)పై రూ.2 కోట్లతో నిర్మిస్తున్న కాజ్ వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. డిసెంబరు ఒకటిన ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కలసి కాజ్‌వేకు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై, శిథిల స్థితికి చేరుకున్న లో లెవెల్ కాజ్ వే స్థానే స్థానికుల విజ్ఞప్తి మేరకు కొత్త కాజ్ వేను నిర్మిస్తున్నారు. ఏటా క్రమం తప్పకుండా వస్తున్న వరదలకు ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీతోనే ఈ కాజ్ వే మునిగిపోతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు ప్రాథమికంగానే బంద్ అయిపోతున్నాయి. దీంతో ప్రధానంగా ఈ కాజ్ వే మీదుగా అప్పనరామునిలంకకు వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. అలాగే అంతర్వేది లక్ష్మీనృసింహుని దర్శనానికి వెళ్లే ఇతర జిల్లాల భక్తులు కూడా అవస్థలు పడుతున్నారు. కాగా కాజ్ వే నిర్మాణ పనులు దృష్ట్యా వేర్వేరు ప్రాంతాల నుంచి మలికిపురం మండలం రామరాజులంక మీదుగా సఖినేటిపల్లి, అంతర్వేది వెళ్లే ప్రయాణికుల వాహనాలను అప్పనరామునిలంక వద్ద దారి మళ్లించారు. ఇక్కడ సఖినేటిపల్లి వైపు గ్రామ సరిహద్దులోని గోదావరి పాయ (బాడిరేవు)పై గతంలో నిర్మించిన కాజ్ వే మీదుగా ఫోర్ వీలర్స్, ఇతర ప్రైవేటు వాహనాలు వెళ్లేట్టుగా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పుష్కరరేవు వైపు కొత్త కాజ్ వే

ఇంత వరకూ కాజ్‌వేకు పడమర వైపునున్న పుష్కర ఘాట్‌ను తొలగించి ఆ వైపు కొత్త కాజ్ వే నిర్మాణం పనులు అధికారులు చేపడుతున్నారు. ఇందుకు రెండు పొక్లెయిన్‌లతో పాత ఘాట్ తొలగించే పనులు నిర్వహిస్తున్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా కాజ్ వేకు రెండు వైపులా సర్వే బాదులతో అడ్డుకట్ట వేసిన అధికారులు, వీటి మీదుగానే టూ వీలర్స్ ప్రయాణానికి అనువుగా ఏర్పాట్లు చేశారు. అలాగే గోదావరి పాయలో నీటి ప్రవాహాన్ని కూడా దారి మళ్లించారు.

కొత్త ఘాట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

టేకిశెట్టిపాలెం వద్ద కొత్త కాజ్ వే నిర్మాణంతో పాటు, కొత్తగా మరో ఘాట్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడ దగ్గర్లో శ్మశానవాటిక ఉండడం వల్ల అపరకర్మ క్రియలకు గోదావరి పాయకు గతంలో మాదిరిగా ఘాట్ ఆవశ్యకత ఉందని వారు చెబుతున్నారు. ఇందుకు అదనపు గ్రాంటు ఘాట్ నిమిత్తం మంజూరు చేయాలని కోరారు.



టేకిశెట్టిపాలెం వద్ద పూర్వం నిర్మించిన లో లెవెల్ కాజ్‌వే

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కొత్తపేటలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ మార్గన, కార్మిక నాయకులు

కొత్తపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమల్లోకి తీసుకువచ్చిన 'వైఎస్సార్ గీత కార్మిక భరోసా' పథకం రాష్ట్రంలోని లక్షలాది గీతకార్మిక కుటుంబాలకు నిజమైన భరోసాగా నిలవనుందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'వైఎస్సార్ గీత కార్మిక భరోసా' పథకం అమలు చేస్తూ జీఓ నంబర్ 1228 విడుదల చేయడంపై కొత్తపేట మండలంలో గీత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఆ మేరకు ఆదివారం స్థానిక మార్కెట్ వీధిలో కోనసీమ కల్లుగీత కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర సంఘం కార్యదర్శి మట్టపర్తి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు లక్ష కుటుంబాలు తమ కులవృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రమాదవశాత్తూ మరణిస్తే ఆ కుటుంబానికి రూ.2 లక్షలే పరిహారంగా ఇచ్చేదని, దానిని పెంచాలని డిమాండ్ చేస్తే రూ.5 లక్షలు అందిస్తామని ప్రకటించింది. కానీ సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో అడగకుండానే గీతకార్మిక కుటుంబాలను స్వయంగా చూసిన సీఎం జగన్ రూ.10 లక్షలకు పరిహారాన్ని పెంచి వారిపై ఎంతో ఉదారత చాటారన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి ఎంపీపీ మార్గన, నాయకులు, కార్మికులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, పలివెల గీతకార్మిక సంఘం అధ్యక్షుడు మార్గన సత్యనారాయణ, చాట్ల ఈశ్వరరావు, దంగేటి నాగేశ్వరరావు, కాకి శాంతారావు, శీలం సత్యనారాయణ, దంగేటి సత్యనారాయణ, ముళ్ల అనంతకుమార్, గుండుపల్లి గోవిందు, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



అంబాజీపేటలో నూతనంగా ఎన్నికైన రైతు సంఘ నాయకులు

అంబాజీపేట: క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సొసైటీ అధ్యక్షుడు, రైతు సంఘ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు అన్నారు. అంబాజీపేటలో రైతు కొర్లపాటి సుబ్రహ్మణ్యవరప్రసాద్ వ్యవసాయ క్షేత్రంలో మాచవరం పంచాయతీ పరిధిలోని రైతుల సమావేశం ఆదివారం నిర్వహించారు. కోటబాబు మాట్లాడుతూ పంటలకు అపార నష్టం కలగజేస్తున్న పందులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. శివారు పంట భూములకు సాగు నీరు అందించడంలో అధికారులు విఫలమవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించాల్సి ఉందన్నారు. అంతకుముందు రైతు సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొర్లపాటి కోటబాబు, ఉపాధ్యక్షుడిగా మట్టపర్తి పరమేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా పొట్టిపోతు స్వామినాయుడు, కార్యదర్శిగా నక్కా భాస్కరరావు, జాయింట్ సెక్రటరీగా ఈతకోట సత్యనారాయణ, ట్రెజరర్‌గా కొత్తూరి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, జాయింట్ సెక్రటరీగా దొమ్మేటి సత్యనారాయణ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సత్యమోహన్, నాగాబత్తుల సుబ్బారావు తదితరులు ఎన్నికయ్యారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



అమలాపురం ఆస్పత్రిలో బాలుడి వైద్యానికి నగదు అందజేస్తున్న పార్టీ సభ్యులు

కొత్తపేట: స్థానిక సంక్రాంతి ఉత్సవాల్లో ప్రమాదవశాత్తూ తీవ్రంగా గాయపడిన బాలుడు చోడపనీడి సత్యసాగర్ వైద్యానికి పలువురు దాతలు ముందుకు వచ్చి సాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆ బాలుడి ముఖం శస్త్ర చికిత్సకు, వైద్యానికి రూ.లక్షలు ఖర్చవుతుంది. అమలాపురంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఇప్పటికే అనేక మంది సాయం చేశారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల బ్రహ్మానందం రూ.10 వేలు, ఆ పార్టీ నాయకులు సలాది వెంకటానందం రూ.2,500, సలాది బ్రహ్మాజీ రూ.2,500, జీబీహెచ్ స్కూల్ పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు రూ.1,000తో మొత్తం రూ.16 వేలను ఎమ్మెల్యే అభిమానుల పేరిట ఆదివారం ఆస్పత్రికి వెళ్లి బాధిత బాలుడి తల్లికి అందజేశారు. అలాగే మండల ఎరువులు, పురుగుమందుల డీలర్ల సంఘం అధ్యక్షుడు చీకట్ల ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు డీలర్లు పరామర్శించి రూ.15 వేలు అందజేశారు. వారికి బాలుడి తల్లి కృతజ్ఞతలు తెలియజేసింది. కుల, మత, వర్గాలకతీతంగా అనేక మంది వ్యక్తిగతంగా, సోషల్ మీడియా గ్రూపుల ద్వారా ఆర్థికసాయం చేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: గ్రామానికి చెందిన వంకా గణేష్ అనారోగ్యంతో అమలాపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో విశ్వరూప్ ఫాలోవర్స్, ఎన్నారై గ్రూప్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం పంపిణీ చేశారు. మోకా సువర్ణరాజు, నాగబేరి కృష్ణమూర్తి, దివ్యాంగుల గౌరవ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఒంటిద్దు వెంకన్న నాయుడుల సహకారంతో గణేష్‌కు సాయం అందించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా జడ్జి



విఘ్నేశ్వరుని సన్నిధిలో రాజమహేంద్రవరం జిల్లా జడ్జి రాజీవ్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని రాజమహేంద్రవరం జిల్లా జడ్జి పి.రాజీవ్ ఆదివారం దర్శించుకున్నారు. రాజీవ్‌కు ఆలయ ప్రధానార్చకుడు వినాయకరావు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామికి జడ్జి విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు రాజీవ్‌ను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ చరిత్రను వివరించారు.

కల్యాణ మండప నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలమూరులో కల్యాణ మండప నిర్మాణానికి విరాళం అందజేసిన దాతలు

ఆలమూరు: గ్రామంలోని భువనేశ్వరి చెరువు సమీపాన నిర్మిస్తున్న కాపు కల్యాణ మండపానికి రూ.లక్ష విరాళాన్ని అందజేత జరిగింది. రావులపాలేనికి చెందిన నందం వీర వెంకట సత్యనారాయణ రూ 50 వేలు, బరంపురం నాగేశ్వరరావు రూ.50 వేలు కల్యాణ మండప నిర్మాణానికి విరాళం ప్రకటించారు. శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావుకు విరాళం మొత్తాన్ని దాతలు ఆదివారం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం, దాతల సహకారంతో కాపు కల్యాణ మండపం శరవేగంగా నిర్మాణం జరుపుకొంటుందని అధ్యక్షుడు ప్రభాకరరావుకు అందజేశారు. కాపు సంఘ నాయకులు రామానుజుల శేషగిరిరావు, చల్లా నానాజీ, ఎలుగుబంటి సాయి, శిరిగినీడి పట్టాభి, నామన దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా నిలవండి



వై.కొత్తపల్లిలో రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ అంబటి భూలక్ష్మి

పి.గన్నవరం: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి వారికి అండగా నిలవాలని ఎంపీపీ అంబటి భూలక్ష్మి పేర్కొన్నారు. వై.కొత్తపల్లిలో వేణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి డాక్టర్ దుర్గరాజు ఆధ్వర్యంలో 30 మంది దాతలు రక్తదానం చేశారు. నల్లా గంగాఈశ్వరరావు సతీమణి నల్లా శేషవేణి స్మారకార్థం వేణి ఫౌండేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా ఏటా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వైద్య రంగానికి అనేక సేవలందిస్తున్నారని స్థానిక సర్పంచ్ తోరం సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, స్థానిక పెద్దలు నల్లా పెదకాపు, కోరుకొండ జాన్, అన్నాబత్తుల అనుబాబు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి శ్రవణం నక్షత్ర పూజలు



నల్లచెరువు వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికి ఆదివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా విశేష క్రతువులు జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు సుదర్శనం శ్రీనివాసాచార్యులు, వేదపండితుడు పవన్‌కుమార్ ఆచార్యుల పర్యవేక్షణలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి విష్వక్సేనపూజ, పంచామృతాభిషేకం, అమ్మవార్లకు అష్టోత్తర కుంకుమపూజ, శాంతి కల్యాణం జరిపారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అలాగే అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ప్రభు సుందర శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు.

జనరేటర్‌ను తినేస్తున్న తుప్పు



అంబాజీపేటలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

అంబాజీపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో విలువైన జనరేటర్‌ను తుప్పు తినేస్తుంది. తహసీల్దార్ కార్యాలయానికి వీసీ నిర్వహించుకునేందు గాను 2010–11లో రూ.లక్షకు పైగా వెచ్చించి ఈ విద్యుత్ జనరేటర్‌ను ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సరైన మెయింటెనెన్స్ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. గతంలో ఓసారి రూ.30 వేలు వెచ్చించి మరమ్మతులు నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీసీ గది, జనరేటర్ నిరుపయోగంగా ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

అగ్నిప్రమాద బాధితులకు పలువురి సాయం



కేశవదాసుపాలెంలో బాధితులకు సాయం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులు పేరాబత్తుల సుబ్బలక్ష్మి, సత్తిబాబులకు ఆదివారం పలువురు సాయం పంపిణీ చేశారు. రాజోలు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా, ఎన్నారై రాజోలు సోషల్ మీడియా ప్రతినిధులు 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. తాడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బాధితులకు అవసరమైన దుస్తులు, నిత్యావసర సరుకులను రాజోలు నియోజకవర్గ జనసేన వీర మహిళలు అందజేశారు. సర్పంచ్ మేడిది సరోజ, ఎంపీటీసీలు ఉండపల్లి సాయికుమారి, జక్కంపూడి శ్రీదేవి, దార్ల లక్ష్మికుమారి, వార్డు మెంబర్ కడలి మంగాదేవి, మహిళలు రావి అంజనాదేవి, తాడి విజయ, అడబాల సత్యమణి, నాగలక్ష్మి పాల్గొన్నారు. వీరితో పాటు భీమవరం నుంచి జేడీ ఫౌండేషన్ టీం, ఏపీ, తెలంగాణ రాధా– రంగా మిత్రమండలి చారిటబుల్ ట్రస్టు, జనసేన పార్టీ టీం, ఫేస్‌బుక్ మిత్రులు కలిపి బాధితులకు నిత్యావసరాలు, వంట సామగ్రిని పంపిణీ చేశారు. వేగి వాణిశ్రీ, బోణం దుర్గాప్రసాద్, అన్నంనీడి రాజేష్, యు.అంజి, రావూరి తేజ, ఎం.ప్రసాద్, గెల్లి శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని చొప్పెల్ల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం రావులపాలేనికి చెందిన ఎస్.శ్రీనివాసు, కుమార్తె అంకిత ద్విచక్రవాహనంపై స్థానిక బస్టాండు సెంటర్‌లో రోడ్డు దాటుతున్నారు. అంతలో రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయాల పాలైన తండ్రి, కుమార్తెను ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



ఆత్రేయపురంలో గురువులతో పూర్వ విద్యార్థులు



మామిడికుదురు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

మామిడికుదురు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1975–76 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకొన్నారు. ఆనాటి చదువుకున్న రోజులకు గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ నాటి చిలిపి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, భజంగలాల్ బియానీ, మొల్లేటి శ్రీరామచంద్రమూర్తి, బోనం చక్రధర్, నగీనే ఫాతిమా, సజ్జాద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1968–69 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం రాజోలులో కలుసుకున్నారు. గత ఆరు సంవత్సరాల నుంచి ఏటా సంక్రాంతి తర్వాత మిత్రులంతా కలుసుకుంటున్నామన్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తాము చదువుకున్న పాఠశాలకు వచ్చి చదువుకున్న రోజులను, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. బిళ్లకోట సోమేశ్వరరావు, కోళ్ల వెంకన్న, మాదాసు మోహనరావు, నైనాల సీతారామారావు, బందా సూర్యనారాయణ, ముళ్లపూడి కేశవరావు, కట్టా చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: స్థానిక మహాత్మాగాంధీ హైస్కూల్‌లో 1984–85లో పదోతరగతి కలసి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే హైస్కూల్‌లో సమావేశమయ్యారు. సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు నిర్వహించుకున్న ఈ అపూర్వ ఆత్మీయ సమ్మేళనం ఎందరికో ఆదర్శప్రాయమైంది. సుమారు 39 సంవత్సరాల క్రితం చదువుకున్న ఆనాటి విద్యార్థులు తమ మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ విద్యార్థుల్లో కొందరు వివిధ రంగాల్లో నిష్ణాతులుగా ఉన్నారు. ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ సభ వేదికపై గురువులను విద్యార్థులు సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా పరస్పరం తమ మధుర జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఎంతో ఆనందంతో సాయంకాలం వరకు ఈ సమ్మేళనంలో మమేకమయ్యారు.



రాజోలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వచ్చే నెల 1న భువనేశ్వరి కల్యాణం

అంబాజీపేట: అంబాజీపేట శివారు కోటివారి అగ్రహారం భువనేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు వచ్చే నెల ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 2 నుంచి 6వ తేదీ వరకు స్వామి వారి పూజలు, త్రిశూల స్నానం, పుష్పోత్సవం జరుగుతాయన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాతపరీక్ష

అంబాజీపేట: స్థానిక ఎస్ఎస్ఎం విద్యా సంస్థలో ఆదివారం నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 240 మంది విద్యార్థులు కావలసి ఉండగా 216 మంది హాజరయ్యారని ఎగ్జామ్ అబ్జర్వర్ ఏపీఎస్‌కె రవీంద్ర, చీఫ్ సూపరింటెండెంట్ ఎల్.తరుణ్‌కుమార్ తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ చర్యలు తీసుకున్నట్లు వారు తెలిపారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల రాత పరీక్ష ఆదివారం స్థానిక దీప్తి కళాశాలలో ప్రశాంతంగా జరిగింది. పటిష్టమైన బందోబస్తు నడుమ ఈ పరీక్ష నిర్వహించారు. 300 మంది అభ్యర్థులకు గాను 269 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరయ్యారు. ఈ కళాశాలలో కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లను కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, రాజోలు సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్సై షేక్ జానీబాషా పర్యవేక్షించారు.